నేడు ఆక్వా, వ్యవసాయ రంగ సమస్యలపై రాష్ట్ర సదస్సు

భీమవరం: వ్యవసాయ, ఆక్వారంగ సమస్యలపై ఈనెల 30వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు భీమవరంలో టౌన్ రైల్వే స్టేషన్ వద్ద ఉన్న జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయాన్ని కాపాడాలి - రైతును నిలబెట్టాలి, అన్ని పంటల రైతుల సమస్యలు పట్టించుకోవాలి, పరిష్కరించాలని అని కోరుతూ ఈ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రముఖ రైతు రాష్ట్ర నాయకులు వై.కేశవరావు, సిపిఎం రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు మంతెన సీతారాం, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎస్.వేణుగోపాలరావు ముఖ్యవక్తలుగా పాల్గొంటారని తెలిపారు. వరి, ఆక్వా, కొబ్బరి, కూరగాయలు, పండ్ల తోటలు, తమలపాకు, ఉప్పు, సరుగుడు, ఆయిల్‌పామ్, చెరకు, కోకో తదితర పంటల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు చర్చిస్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల ఇప్పటికే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి కేటాయింపులు తగ్గించడం, ఎరువుల ధరలు పెంచేసి సబ్సిడీలు కుదించడం అన్యాయమని విమర్శించారు.

అంగన్‌వాడీలపై ఆర్థికభారం..!

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో సొంత డబ్బులతో స్టాల్స్ ఏర్పాటు
ప్రదర్శనకు 50 రకాల వంటలు తయారీ
ఒక్కో క్యాంపునకు రూ.4 వేల నుంచి రూ. ఏడు వేల వరకు ఖర్చు
ఇప్పటికే అనేక సమస్యలతో అంగన్‌వాడీలు సతమతం

భీమవరం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్

ప్రజాశక్తి - భీమవరం

సవాలక్ష సమస్యలతో సతమతమవుతున్న అంగన్వాడీలపై ఆర్థిక భారం పడింది. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో అంగన్వాడీలు సొంత డబ్బులు వెచ్చించి రకరకాల పౌష్టికాహార వంటలు తయారుచేసి స్టాల్స్ ఏర్పాటు చేయడంతో మరిన్ని ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో క్యాంపునకు రూ.4వేల నుంచి రూ.ఏడు వేల వరకూ సొంత డబ్బులు వెచ్చిస్తున్నారు. స్టాల్స్ ఏర్పాటు తప్పనిసరిగా చేయాలని అధికారుల నుంచి ఒత్తిడి రావడంతో ఆర్థిక భారమైనప్పటికీ తప్పని పరిస్థితుల్లో అంగన్వాడీలు స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తూ నెల రోజుల నుంచి అష్టకష్టాలు పడుతున్నారు. ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించాలనే ముఖ్య ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గతనెల 30 నుంచి ప్రారంభించింది. ఈ క్యాంపుల్లో ప్రత్యేక వైద్యులతో ఆరోగ్య సేవలందించడంతోపాటు ఉచితంగా మందులు కూడా పంపిణీ కార్యచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. అయితే ఈ క్యాంపుల్లో ప్రత్యేక స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగా వైద్య సేవలకు సంబంధించిన స్టాల్స్‌తో పాటు అంగన్వాడీలు అందించే పౌష్టికాహారానికి సంబంధించిన స్టాల్స్‌ని కూడా ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఈ స్టాల్‌లో రకరకాల పౌష్టికాహార వంటలను అంగన్వాడీలు వండి ప్రదర్శనకు ఉంచుతున్నారు. అయితే ఈ వంటకాలకు సంబంధించిన ఆర్థిక భారాన్నంత అంగన్వాడీలు మోస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఏడు ఐసిడిఎస్ ప్రాజెక్టులు, ఏలూరు జిల్లాలో 13 ప్రాజెక్టులున్నాయి. ఈ రెండు జిల్లాల్లో 3600 మెయిన్, మినీ అంగన్వాడీ కేంద్రాలున్నాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపుగా 7200 మంది అంగన్వాడీలు పనిచేస్తున్నారు. అయితే ఈ ఈ శిబిరాల వద్ద స్టాళ్లను ఏర్పాటు చేసి పౌష్టికాహారంతో కూడిన పదార్థాలను ప్రదర్శించాలని ఉన్నతాధికారులు ఒత్తిడికి గురిచేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇదిలా ఉంటే సురక్ష శిబిరానికి వచ్చిన వారందరికి అంగన్వాడీలు తయారు చేసిన వంటల రుచి చూపించడంతోపాటు వాటిలోని పౌష్టికాహారం గురించి వివరించి చెప్పాల్సి కూడా అంగన్వాడీలే నిర్వర్తిస్తున్నారు. అయితే రకరకాల వంటల తయారీకి ఎలాంటి బడ్జెట్‌నూ కేటాయించలేదు. దీంతో అంగన్వాడీ కార్యకర్తలు సొంత ఖర్చుతో సామాలు, కొర్రలు, కూరగాయలు, మాంసకృత్తులు ఇతర వస్తువులను కొనుగోలు చేసి వాటితో పదార్థాలను తయారు చేసి స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో తమపై ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ సురక్ష కార్యక్రమం చేపట్టి నెల రోజులుగా అంగన్వాడీలు అధికారుల ఒత్తిడి తాళలేక ఆర్థికభారాన్ని మోయలేక మానసికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సచివాలయానికి ఒక క్యాంపు చొప్పున ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతంలో ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు అంతా తలో కొంత వేసుకుని వంటకాలు తయారు చేస్తున్నారు. కొన్నిప్రాంతాల్లో మినీ అంగన్వాడీ కార్యకర్తలు అప్పు చేసి పెడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలతో సతమతం

ఇప్పటికే అంగన్వాడీలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడమే కాకుండా ప్రభుత్వం ఇచ్చే దానిలో సైతం కోతలు విధించడంతో ఆర్థికంగా మానసికంగా ఇబ్బందులు పడుతున్నారు. విపరీతమైన పని భారం, ఆన్‌లైన్ పని, కేంద్రాల నిర్వహణ, అధికారుల రాజకీయ ఒత్తిడితో అవస్థలు పడుతున్నారు. సుమారు 18 నెలల నుంచి కనీసం టిఎ, డిఎ కూడా ప్రభుత్వం చెల్లించలేదు. చివరకు అంగన్వాడీ కేంద్రాల అద్దెలు సైతం నాలుగు నెలల నుంచి చెల్లించలేదు. నెల మొత్తం అంగన్వాడీలు కష్టపడి పని చేస్తున్నప్పటికీ కనీస వేతనాలు కూడా సక్రమంగా ప్రభుత్వం అందించట్లేదు. రెండు నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇలా అనేక సమస్యల మధ్య అంగన్వాడీలు నలిగిపోతూ విధులు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం పని భారం మోపడంతో పాటు మరింత ఆర్థిక భారాన్ని కూడా మోపడంతో అంగన్వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సురక్ష శిబిరాల వద్ద స్టాళ్ల నిర్వహణతో మరింత అవస్థలు పడుతున్నట్లు వాపోతున్నారు. ఈ విషయాన్ని బయటకు చెప్పుకోలేక, అధికారులను బిల్లులు అడగలేక నరకయాతన అనుభవిస్తున్నారు. ఉన్నతాధికారులు ఒత్తిడి చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో తమ డబ్బులతో సరుకులను కొనుగోలు చేసి పౌష్టికాహారం తయారు చేస్తున్నట్లు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి అంగన్వాడీ ఇబ్బందులపై దృష్టిసారించి పౌష్టికాహారం తయారీకి బడ్జెట్ కేటాయించాలని కోరుతున్నారు.

నిధులు కేటాయిస్తాం

సుజాత రాణి, ఐసిడిఎస్ పీడీ

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో అంగన్వాడీలు ఏర్పాటు చేస్తున్న స్టాల్స్‌లో పెడుతున్న వంటకాలకు సంబంధించి నిధులు కేటాయించడం జరుగుతుంది. ప్రాజెక్ట్, అంగన్వాడీ కేంద్రాల వారీగా వీటిని కేటాయిస్తాం. ఎక్కువగా వంటకాలు బాలామృతంతో చేసినవే ప్రదర్శించడం జరిగింది. అలాగే ఆకుకూరలు, పండ్లు వంటివి స్టాల్‌లో ఉంచుతాము వీటికి ఎంత మేర ఖర్చవుతుందో చూసి ఆ విధంగా నిధులు కేటాయించడం జరుగుతుంది.

ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

కె.విజ్జి, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు)

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో పౌష్టికాహార పదార్థాల తయారీకి అవసరమైన ఖర్చులను ప్రభుత్వం భరించాలి. వీటికి ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలి. ఇప్పటికే అంగన్‌వాడీలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. మూడు నెలల నుంచి జీతాలు అందడం లేదు. బిల్లులు కూడా మంజూరు చేయట్లేదు. ఈ పరిస్థితుల్లో వేలాది రూపాయలు పౌష్టికాహారానికి అంగన్‌వాడీలు ఖర్చు చేస్తున్నారు. సుమారు 50 రకాల వంటకాలను తయారు చేస్తున్నారు. ఇది సరైంది కాదు. ఆర్థిక భారం తాళలేక అప్పులు చేయాల్సి వస్తుంది. ప్రభుత్వం దృష్టిసారించి బడ్జెట్ కేటాయించాలి.

వృద్ధుల సంక్షేమం, హక్కుల రక్షణకు కృషి

వికలాంగులు, హిజ్రాల, వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ప్రభాకర్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నిరాదరణకు గురవుతున్న వృద్ధుల సంక్షేమంతో పాటు వారి హక్కుల పరిరక్షణకు తమ శాఖ నిరంతరం కృషి చేస్తుందని వికలాంగులు, హిజ్రాలు, వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జిసి హెచ్.ప్రభాకర్ తెలిపారు. వికలాంగులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలేంటి, రాయితీలేంటి? హిజ్రాల సంక్షేమానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు? వృద్ధుల రక్షణ చట్టాల అమలు తీరు ఎలా ఉంది వంటి పలు ప్రశ్నలకు ప్రజాశక్తి ముఖాముఖిలో ఆయన సమాధానాలిచ్చారు.

ప్రశ్న : వికలాంగుల, హిజ్రాల, వృద్ధుల సంక్షేమ శాఖ ముఖ్య ఉద్దేశం ఏమిటి?

వికలాంగులకు, హిజ్రాలకు, వృద్ధులకు ప్రభుత్వం కల్పించే రాయితీలు అందించడంతోపాటు వారి హక్కుల పరిరక్షణకు కృషి చేయటం, వారికి కావాల్సిన ఉపకరణాలు అందించడమే ఈ శాఖ ముఖ్య ఉద్దేశం.

ప్రశ్న : వృద్ధుల సంక్షేమం కోసం ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

వృద్ధులకు గుర్తింపు కార్డులు అందజేయడం, అవసరమైన వారికి చేతి కర్రలు, వీల్ చైర్లు అందిస్తున్నాము. అలాగే 2007 వృద్ధుల, తల్లిదండ్రుల సంక్షేమ జీవన భృతి చట్టంపై అవగాహన కల్పించి ఆ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి నిరాదరణకు గురైన వృద్ధులను ఆదుకోవడం జరుగుతుంది.

ప్రశ్న : 2007 చట్టం ప్రకారం వృద్ధులకు ఎలాంటి రక్షణ కల్పించబడుతుంది? ఈ సంవత్సరం జిల్లాలో ఎంతమందికి రక్షణ కల్పించారు?

ఈ చట్టం ప్రకారం 60 సంవత్సరాలు దాటి, పిల్లలు ఉండి ఆ పిల్లల ద్వారా నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురైతే ప్రతి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఆర్‌డిఒ ఆధ్వర్యంలో మెయింటినెన్స్ ట్రిబ్యునల్ ద్వారా ప్రతినెల ఆ వృద్ధులకు రూ.పదివేల వరకూ మెయింటినెన్స్ పిల్లల నుంచి ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వడం జరుగుతుంది. ఈ సంవత్సరం ఆర్‌డిఒ పరిధిలో 27 మందికి, నూజివీడు సబ్ కలెక్టర్ పరిధిలో 22 మందికి, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ పరిధిలో 17 మందికి జీవన భృతి కల్పించాము. ఈ విషయంలో తల్లిదండ్రులు సంతృప్తి చెందకపోతే జిల్లా కలెక్టర్ వద్ద అప్పీల్ చేయొచ్చు. అంతేకాక సెక్షన్ 23 ప్రకారం ఎవరైనా తల్లిదండ్రులు పిల్లలకు ఆస్తి రాసి ఇచ్చిన తరువాత నిరాదరణకు గురైతే తిరిగి ఆస్తిని స్వాధీనం చేసుకోవచ్చు. పై చర్యలు అమలు చేయకపోతే తల్లిదండ్రులను, వృద్ధులను నిర్లక్ష్యం చేసిన పిల్లలకు ఆరు నెలల వరకూ జైలు శిక్ష అమలు చేసే అవకాశం ఉంది.

ప్రశ్న : వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం వారికి ఎలాంటి హక్కులు రాయితీలు కల్పించబడతాయి?

2016 వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం వారికి సామాజిక గౌరవం లభించేలా చేయడం, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో వికలాంగులకు సౌకర్యాలు కల్పించడం, (ఉదాహరణకు వారు కార్యాలయంలోకి వెళ్లేందుకు ర్యాంపు నిర్మించడం వంటివి), మున్సిపల్, పంచాయతీల్లో బిల్డింగ్ ప్లాన్ ఇచ్చే సమయంలో వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం నిర్మాణం ఉంటేనే ప్లాన్ అప్రూవల్ చేసేలా చర్యలు తీసుకోవడం, ఉద్యోగాల్లో రిజర్వేషన్ పరిశీలించి వారికి కేటాయించిన నాలుగు శాతం రిజర్వేషన్ ప్రతీ కార్యాలయంలో అమలు జరిగేలా చూడటం వంటి హక్కులు వారికి కల్పించబడతాయి.

ప్రశ్న : వికలాంగ విద్యార్థులకు ఎలాంటి రాయితీలు, సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తుంది?

వికలాంగ విద్యార్థులకు ఏలూరు జిల్లా కేంద్రంలోని కోటదిబ్బపై రెండు హాస్టళ్లు నిర్మిస్తున్నారు. నాలుగో తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకూ అన్ని సౌకర్యాలూ ఉచితంగా కల్పించబడతాయి. అలాగే ఉన్నత విద్య చదివే వారికి 50 వేల రూపాయలు విలువచేసే ల్యాప్‌టాప్‌లు ఉచితంగా ఇస్తారు. ఈ సంవత్సరం పదిమందికి ఇవ్వడం జరిగింది.

ప్రశ్న : వికలాంగులకు ఎలాంటి ఉపకరణాలు మీ శాఖ ద్వారా అందిస్తున్నారు? జిల్లాలో ఈ సంవత్సరం ఎంతమందికి ఇచ్చారు?

ఈ సంవత్సరం జిల్లాలో 22 మందికి వీల్ చైర్లు, 18 మందికి ట్రై సైకిళ్లు ఇచ్చాము. అలాగే ఏలూరు జిల్లాలో 70 మందికి, పశ్చిమగోదావరి జిల్లాలో 70 మందికి మొత్తం 140 మందికి మోటార్ సైకిళ్లు అందించాము. అలాగే బధిరుల కోసం ప్రత్యేక ఫోన్లు పది మందికి ఇచ్చాము. అలాగే వినికిడి యంత్రాలు, మానసిక వికలాంగుల కోసం డైజీ ప్లేయర్స్ కిట్‌లు ఇచ్చాము.

ప్రశ్న : వికలాంగుల స్వయం ఉపాధికి మీ శాఖ ద్వారా రుణాలేమైనా అందిస్తున్నారా?

వికలాంగుల కార్పొరేషన్ ద్వారా రూ.లక్ష నుంచి రూ.ఐదు లక్షల వరకూ స్వయం ఉపాధి కోసం రుణాలు అందిస్తున్నాము. ఈ ఏడాది పశ్చిమగోదావరి జిల్లాలో ముగ్గురికి ఇచ్చాము. ఏలూరు జిల్లాలో ఐదుగురికి ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నాము.

ప్రశ్న : డిస్ట్రిక్ట్ డిజేబుల్ డిజేబిటేషన్ సెంటర్ ద్వారా వికలాంగులకు ఎలాంటి సహాయ సహకారాలు అందిస్తున్నారు?

ఈ సెంటర్ ద్వారా వికలాంగులకు కృత్రిమ కాళ్లు, చేతులు, ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ వంటివి అందిస్తున్నాము. అంతేకాక ఆటోమేటెడ్ కృత్రిమ చేతులను అమర్చేందుకు ప్రస్తుతం అర్హులైన వారి వివరాలు సేకరించాము. ఇప్పటికే ఏలూరు జిల్లాలో 35 మందిని, పశ్చిమగోదావరి జిల్లాలో 27 మందిని గుర్తించాము.

ప్రశ్న : హిజ్రాల సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

హిజ్రాలకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి వారికి సింగిల్ రేషన్ కార్డు పొందేలా చర్యలు చేపట్టడం జరిగింది. అలాగే వారిని ఓటర్లుగా నమోదు చేసేందుకు చర్యలు చేపట్టాము. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 137 మంది ఓటర్లుగా నమోదయ్యారు. సారిక అనే ఒక హిజ్రాను ఎన్నికల ఐకాన్‌గా గుర్తించి ఓటర్ల నమోదుకు కృషి చేయడం జరుగుతుంది.

ప్రశ్న : హిజ్రాలు ఎక్కువగా షాపింగ్ మాల్స్ దగ్గర, రహదారులపై భిక్షాటనకు మగ్గుచూపుతున్న పరిస్థితుల్లో వారిలో మార్పు తీసుకొచ్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

వారిలో స్వయం ఉపాధి వైపు ఎక్కువమంది మొగ్గుచూపేలా స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ఇస్తున్నాము. అలాగే వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వటం జరుగుతుంది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 22 మందికి ఇళ్లస్థలాలిచ్చాము. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి భిక్షాటన నుంచి వారిని బయటకు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాము. 2019 ట్రాన్స్ జెండర్ చట్టాన్ని వివరించి వారి ప్రవర్తనలో మార్పు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాము.

ప్రశ్న : హిజ్రాలకు ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ ఏమైనా ఉందా? ఉద్యోగాల వైపు వారిని ఆకర్షించేలా ఏమైనా ప్రయత్నాలు జరుగుతున్నాయా?

హిజ్రాల్లో జన్యుపరమైన లోపాలు తప్పితే శారీరకపరమైన లోపాలు లేనందున వారికి ఎలాంటి రిజర్వేషన్ లేదు. కానీ ఇప్పుడిప్పుడే వారు ఉద్యోగాల వైపు ఆకర్షితులయ్యేలా అవగాహన కల్పించడం జరుగుతుంది. పోలీసు ఉద్యోగాలకు కొంతమంది దరఖాస్తు చేసినట్లు తెలిసింది.

ప్రశ్న : వికలాంగుల మానసిక ఉల్లాసానికి, వారిలో ప్రతిభను గుర్తించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

వారిలో మానసిక ఉత్తేజంతోపాటు ఆత్మస్థైర్యం, పోటీతత్వం పెంచి వారిలో ప్రతిభను గుర్తించేందుకు డిసెంబర్ మూడో తేదీన జిల్లాస్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నాము. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ఇవ్వడంతో పాటు విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతాము.

ప్రశ్న : చివరిగా వికలాంగులకు, వృద్ధులకు, హిజ్రాలకు మీరిచ్చే సలహా ఏంటి?

శారీరకంగా అయినా, మానసికంగా అయినా వైకల్యం అనేది ఉన్నప్పుడు దాన్ని లోపంగా భావించి కుంగిపోకూడదు. వైకల్యంతో ఉన్నప్పటికీ ప్రపంచ విజేతలుగా నిలిచిన వారు ఎందరో ఉన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని వైకల్యాన్ని జయించి, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, సంక్షేమ కార్యక్రమాలు, రక్షణ చట్టాలు ఉపయోగించుకుని మంచి జీవనశైలిని అలవాటు చేసుకోవాలి. వైకల్యాన్ని జయించి విజేతలుగా నిలవాలి.

పొలంలో వాలీబాల్ ఆడి ఎంఎల్ఎ వినూత్న నిరసన

ప్రజాశక్తి - పోడూరు

వైసిపి ప్రభుత్వం రైతు దగా ప్రభుత్వమని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు విమర్శించారు. పెనుమదంలో బీటలు తీసిన వరి పొలాలను ఎంఎల్ఎ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రైతులతో కలిసి పొలంలో వాలీబాల్ ఆడుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వద్ద రైతులు గోడు వెల్లబోసుకున్నారు. చిరుపొట్ట దశలో ఉన్న వరిచేలకు నీరందకపోతే కోతకు పని చేయవన్నారు. యలమంచిలి, పాలకొల్లు, పోడూరు మండలాల రైతులు సాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

సాగునీరు లేక ఎండిన వరిపొలంలో వాలీవాల్ అడుతూ నిరసన తెలుపుతున్న ఎంఎల్ఎ నిమ్మల

దీనిపై ఎంఎల్ఎ రామానాయుడు మాట్లాడుతూ సార్వాలో వరి చేలకు అవసరమైన సాగునీరు అందించకపోతే ఇరిగేషన్ కార్యాలయాలను రైతులతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు. నాలుగున్నర సంవత్సరాల్లో జగన్ ప్రభుత్వం పంట కాలువల్లో తట్ట మట్టి, గుర్రపు డెక్క, కర్ర నాచు వంటివి తొలగించలేదన్నారు. రైతు వ్యతిరేక, దగా, మోసకర జగన్ ప్రభుత్వమని విమర్శించారు. సార్వాలోనూ నీటి ఎద్దడి ఎదురవడం దురదృష్టకరమన్నారు. వెంటనే సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

జగనన్న ఇళ్ల లబ్ధిదారుల రుణం పెంచాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆకివీడు

జగనన్న కాలనీలో పర్యటిస్తున్న సిపిఎం నేతలు

జగనన్న కాలనీల్లో ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.పది లక్షల ఖర్చవుతోందని, ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు సరిపోవడం లేదని, ఫలితంగా లబ్ధిదారులు అప్పుల పాలవుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. ఆర్థికంగా శక్తి లేనివారు ఇల్లు కట్టుకోలేక ఇల్లు వచ్చిందనే ఆనందం కన్నా అప్పుల పాలయ్యామనే ఆవేదన ఎక్కువైందని ఆయన విమర్శించారు. ప్రతిఇంటికీ ప్రభుత్వం రూ.ఆరు లక్షలు ఉచితంగా ఇవ్వాలని, మరో నాలుగు లక్షల రూపాయలు వడ్డీ లేని రుణం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. మండలంలోని తాళ్లకోడు జగనన్న కాలనీలో బలరాం ఆధ్వర్యంలో పార్టీ బందం ఆదివారం పర్యటించింది. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. పట్టణంలో మూడు వేల మందికి పైగా ప్రభుత్వం పట్టాలిస్తే వాటిలో 200 మంది మాత్రమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. మరో 400 మంది ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. లబ్ధిదారులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఆర్థికంగా సహకరించాలని సూచించారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్లు, డ్రెయిన్లు, శ్మశానవాటికలు, పాఠశాలలు, విద్యుత్, తాగునీరు వంటి సదుపాయాలను సమకూర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో లబ్ధిదారులను సమీకరించి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ సిపిఎం బృందం కాలనీలో నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, పట్టణ కార్యదర్శి కె.తవిటి నాయుడు, పార్టీ నాయకులు డోకల రవి, బి.రాంబాబు, ఎస్.సూరిబాబు పాల్గొన్నారు.

రైతు సదస్సును జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం రైస్ మిల్లర్స్ హాల్లో టౌన్ రైల్వే స్టేషన్ వద్ద జరిగే రైతు రాష్ట్ర సదస్సును అన్ని రకాల పంటల రైతులు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం రైతు రాష్ట్ర సదస్సు కరపత్రాలను వెంప, పెదగురువు, దిలుసుమర్రు, సంతోషపరం, తోకతిప్ప, బేతపూడి, తాడేరులో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో వరి, ఆక్వాతో సహా అన్ని పంటల రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. అప్పులు చేసి సాగుచేసి, సరైన ధర లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు ప్రకారం ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం పంటలకు మద్దతు ధర కల్పించాలని ఉన్నా బిజెపి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి దగా చేసిందన్నారు. ప్రభుత్వాల పుణ్యమంటూ ఎరువులు, పురుగు ముందు ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు పైకి ఎగబాకి రైతాంగాన్నే దెబ్బతీస్తున్నాయన్నారు. అన్ని పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌరు శ్రీను, పంపన భాస్కరరావు, జక్కంశెట్టి శ్రీను, కుక్కల నాగరాజు పాల్గొన్నారు.

సాగరతీరం.. ఆనందకరం

ప్రజాశక్తి - మొగల్తూరు

సముద్ర స్నానాలు చేస్తున్న పర్యాటకులు

మండలంలోని పేరుపాలెంబీచ్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక, ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటలో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు.

సాగునీరందించడంలో వైసిపి విఫలం : నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

పచ్చని జిల్లాలో సాధారణంగా ప్రతిసార్వా సీజన్‌లో వరి చేలో కాలు పెడితే మోకాళ్ల వరకూ దిగిపోతాయని, కానీ ప్రభుత్వం సాగునీరందించడంలో విఫలం కావడంతో ఈ ఏడాది ఆట స్థలాలుగా మారాయని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. బీటలు వారిన వరి చేలో రైతులతో కలిసి వాలీ బాల్ ఆడుతూ వినూత్న రీతిలో ప్రభుత్వానికి నిరసన తెలిపినట్లు చెప్పారు. పోడూరు మండలం పెనుమదంలో సాగునీరందక నెర్రలు తీసి ఎండిపోయే పరిస్థితుల్లో వరి చేలు ఉన్నాయన్నారు. చిరుపొట్ట దశలో ఉన్న చేలకు నీరు అందకపోతే కోతకు పనికి రాదని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. నియోజకవర్గంలోని యలమంచిలి, పాలకొల్లు, పోడూరు మండలాల్లో రైతులు సాగునీటికి సతమతమవుతున్నారన్నారు. నాలుగున్నర సంవత్సరాల్లో జగన్ ప్రభుత్వం పంట కాలువల్లో తట్ట మట్టి, గుర్రపు డెక్క, కర్ర నాచు వంటివి తొలగించింది లేదని విమర్శించారు. లాకులకు గ్రీజు కూడా పెట్టలేదని, కనీసం ఎత్తిపోతల మోటార్లకు మరమ్మతు పనులు చేపట్టలేదని, రైతు వ్యతిరేక, దగా, మోసకారి.. జగన్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సార్వా అంటే సమృద్ధిగా నీరు అందే పంట అని, జగన్ ప్రభుత్వంలో సార్వా సమయంలోనూ నీటి ఎద్దడి ఎదురవడం ప్రభుత్వ చేతగాని తనమన్నారు.

ముఠా కార్మికులపై దాడిని నిరసిస్తూ ధర్నా

ప్రజాశక్తి - ఆకివీడు

పట్టణంలో ఇటీవల కాలంలో ఆకతాయిల అసాంఘిక కార్యక్రమాలు, అరా చకాలు విపరీతంగా పెరిగిపోయాయని సిఐటియు మండల కార్యదర్శి కె. తవిటినాయుడు అన్నారు. స్థానిక బజారు ముఠా కార్మికులపై తెలగ సామాజిక తరగతికి చెందిన యువకులు అకారణంగా దాడి చేయడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మెయిన్ సెంటర్లో ధర్నా చేపట్టారు. గంజాయి, అక్రమ మద్యం అమ్మకాలు, దొంగతనాలు, అరాచక శక్తుల విజృంభణ పెరిగిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇటువంటి అరాచక శక్తులను కఠినంగా శిక్షించాలన్నారు. ముఠా కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామన్నారు. వారిపై అక్రమంగా దాడి చేసి వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెంకి అప్పారావు, నెల్లి సూరిబాబు, షేక్ వలీ, డోకల రవితేజ, ఆర్.రమణ, ఎం.శ్రీను, రమణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తాయని ఆర్‌డిఒ దాసి రాజు అన్నారు. భీమవరం లూథరన్ హైస్కూల్లో ఎపి బహుజన జెఎసి మూడో వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలను ఆర్‌డిఒ ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. వార్షికోత్సవం సందర్భంగా జెఎసి సభ్యులు ఐకమత్యంతో వివిధ రకాల క్రీడలను ఏర్పాటు చేసుకుని ఉల్లాసంగా ఉత్సాహంగా గడపడం ఆనందించదగ్గ విషయమన్నారు. గౌరవాధ్యక్షులు కాటం స్టాన్లీ రాజు, జెఎసి అధ్యక్షులు కొనా జోసఫ్, తాళ్లూరి మధు మాట్లాడుతూ పురుషులకు క్రికెట్, కబడ్డీ, కోకో, మహిళలకు మ్యూజిక్ చైర్స్ పోటీలను నిర్వహించామని గెలుపొందిన వారికి బహుమతులను అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈది రవికుమార్, కోనా రంజిత్, బిరుదుగడ్డ రమేష్ బాబు, మాజీ కౌన్సిలర్ పాలవెల్లి మంగ పాల్గొన్నారు.

ధరల అదుపులో ప్రభుత్వాలు విఫలం

ప్రజాశక్తి - ఉండి

రోజు రోజుకు విపరీతంగా పెరుగుతున్న నిత్యావసర, ఉల్లిపాయల ధరలను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. ఆదివారం ఉండి పెద్ద వంతెన సెంటర్లోని ప్రజా సంఘాల కార్యాలయంలో నాయకులు చీరల శేషు అధ్యక్షతన పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ అధికారం చేపట్టిన తర్వాత ధరలను అదుపు చేస్తామని హామీ ఇచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర సరుకుల ధరలు, గ్యాస్ పెట్రోల్, డీజిల్ ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమయ్యాయన్నారు. ఉల్లిపాయలను పెద్ద ఎత్తున అక్రమంగా నిల్వచేసి కృత్రిమ కొరత సృష్టించడం ద్వారా ఉల్లి ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, ప్రభుత్వాలు చొరవ తీసుకుని వెంటనే ధరలను అదుపులోకి తీసుకొచ్చి ప్రతి ఒక్కరికి కిలో 20 రూపాయలకే అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు. ధరలను అదుపు చేయలేని ప్రభుత్వాలకు వచ్చే ఎన్నికల్లో పరాభవం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్, నాయకులు కిలారి తవిటినాయుడు, మాదాసి గోపి, నిమ్మిత కిషోర్, వీరవల్లి మాధవరావు, రామకూరి వెంకటరత్నం, కొట్టాడ వెంకటేశ్వరరావు, కాలువ యేసు, మోపిదేవి రాము, ఇర్రింకి శ్రీరామ్మూర్తి, కింతాడ రమేష్ పాల్గొన్నారు.

5న భీమవరంలో బాలోత్సవం

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో నవంబర్ 5వ తేదీన బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కార్యదర్శి మంతెన కృష్ణంరాజు తెలిపారు. ఈ బాలోత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలోత్సవ సంబరాల్లో భాగంగా ప్రఖ్యాత చిత్రకారుడు అడవి బాపిరాజు స్మారక చిత్రలేఖనం పోటీలు ఐదో తేదీన చింతలపాటి బాపిరాజు 'హైస్కూల్‌లో నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ పోటీలను వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజు, భీమవరం డ్రాయింగ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు.కార్యక్రమంలో బాలోత్సవ్ కమిటీ సభ్యులు, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు, పి.సీతారామరాజు, ఎం.రాజేంద్రబాబు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులు బొల్లం శ్రీను, గుబ్బల భార్గవి, పెంటకోట రాంబాబుకు రూ.3.60 లక్షల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు తోట భోగయ్య, కొణితివాడ గ్రామ ఉపసర్పంచి నాగరాజు శ్రీనివాసరాజు, కొట్టి కుటుంబరావు, బుంగ ప్రహల్లాధుడు, ఉమ పాల్గొన్నారు.

కాళ్ల:రాష్ట్రంలో తమ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పూర్తి భరోసా ఇస్తోందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు తెలిపారు. పెదఅమిరంలోని వైసిపి క్యాంపు కార్యాలయంలో ఆదివారం సిఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. ఉండి నియోజకవర్గానికి చెందిన ఐదుగురు లబ్ధిదారులకు రూ.5 లక్షల 40 వేల చెక్కులను డిసిసిబి ఛైర్మన్ అందజేశారు. ఈ సందర్భంగా పివిఎల్ మాట్లాడారు. పెదఅమిరం గ్రామంలో ఉండి రోడ్డులో కలెక్టర్ క్యాంపు ఆఫీస్ ఎదుట నూతనంగా ప్రారంభించిన మ్యాజిక్ ఫొటో ల్యాండ్‌ను నరసింహరాజు ప్రారంభించారు.

ఉండి : సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆదివారం డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు లబ్ధిదారులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా పివిఎల్ మాట్లాడుతూ ఖరీదైన వైద్యానికి సంబంధించి అయ్యే ఖర్చు భరించలేని నిరుపేదలకు సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నగదు అందించి భరోసా ఇవ్వడం అభినందనీయమన్నారు.

విద్యార్థికి మానవత సాయం

పెనుమంట్ర :ఎంసిఎ చదువుతున్న పేద విద్యార్థికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు రూ.15 వేల ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. అంతకుముందు మానవత అధ్యక్షులు బాణాల శ్రీనివాసరావు అధ్యక్షతన నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా హాజరైన మానవతావాదులు, వ్యాపారవేత్త వెలగల ఉదయ భాస్కర్‌రెడ్డి, బసంతి దేవి బాలికల హైస్కూల్ హెచ్ఎం తమిరి రుద్ర సాంబశివరావులు వారు చేస్తున్న సమాజసేవలను గుర్తించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ వారు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొత్త సత్యనారాయణమూర్తి, కోశాధికారి శ్రీనివాసుల మురళీకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ కర్రి కుప్పారెడ్డి, వైస్ ఛైర్మన్ పడాల జగన్నాధ రెడ్డి పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు పున: నిర్మాణానికి శంకుస్థాపన

పోడూరు:మండలంలోని మట్టపర్రు గ్రామంలో నిరుపయోగంగా ఉన్న దిన్నపాలెం బిసి కమ్యూనిటీ హాల్ పునర్నిర్మాణానికి నిధుల కోసం ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడుకు బిసి సంఘం నాయకులు తెలిపారు. ఎంఎల్ఎ నిమ్మల ఎంపీ కనుమూరి రఘురామకృష్ణరాజుతో మాట్లాడి ఎంపీ నిధుల నుండి 15 లక్షల రూపాయలు మంజూరు చేయించారు. ఆదివారం బిసి కమ్యూనిటీ హాల్ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దొమ్మేటి శ్రీనివాస్, ఉప సర్పంచ్ విధ్యంశెట్టి సత్యనారాయణ, ఏళ్లమెల్లి వెంకటరావు, మాజీ ఎంపిపి పెన్మెత్స రామ భద్రరాజు పాల్గొన్నారు.

మహిళలు, విద్యార్థులకు పలు పోటీలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని పాలపర్తివారిపేటలోని ప్యాసన్ చర్చి ఆవరణలో ఆదివారం సాయంత్రం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ నెల 31న మతోద్దారణ పండుగను పురస్కరించుకుని ప్యాసన్ చర్చి పాస్టర్ రెవరెండ్ గోడి యేసుబాబు ఆధ్వర్యంలో మహిళలకు, చిన్నారులకు, సండే స్కూల్ విద్యార్థులకు కబడ్డీ, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ ఛైర్స్, పరుగు పందాలు, బైబిల్‌పై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి మతోద్ధారణ పండుగ రోజున బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డెలిగేట్ మైలాబత్తుల శామ్యూల్ జాన్, సంఘ పెద్దలు వడ్లమూడి వెంకటేశ్వర్లు, మేడిది బాబూరావు, పాలపర్తి జయరాజు పాల్గొన్నారు.

పేరుపాలెంనార్త్‌లో అన్నదానం

మొగల్తూరు:పేరుపాలెంనార్త్ గ్రామంలో రజకపేటలో వేంచేసియున్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం భారీ అన్న సమాధాన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

క్రికెట్ బుకీ అరెస్టు

వీరవాసరం:వీరవాసరంలో క్రికెట్ బుకీని, బెట్టింగ్‌కు పాల్పడుతున్న మరికొంత మందిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ రమేష్ ఆదివారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో భాస్కర మెడికల్ షాపు పై శనివారం దాడి చేసినట్లు తెలిపారు. ఆ సమయంలో షాపు యజమాని చిట్టిబాబు తన సెల్ ఫోన్ ద్వారా ప్రపంచ కప్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న క్రికెట్‌ను మ్యాచ్ టివిలో చూస్తూ సెల్‌ఫోన్ ద్వారా డబ్బులను పణంగా పెట్టి పంటర్స్ మధ్య చిట్టిబాబు బుకీగా ఉంటూ బెట్టింగ్ నిర్వహిస్తున్న సమయంలో దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. బుకీ నుంచి రెండు సెల్‌ఫోన్లు, టివి స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. బుకీ సెల్‌ఫోన్ ద్వారా మరిన్ని వివరాలు సేకరించి మరి కొంత మంది పాత్రపై విచారణ చేస్తున్నామన్నారు. ఇదిలా ఉంటే దోషుల పట్ల కఠినంగా వ్యవహరించాలని టిడిపి నాయకులు అంటుంటే వారిని రక్షించే క్రమంలో వైసిపి నాయకులు ఉన్నట్టు సమాచారం.

మద్యంతాగి విధులకు రైల్వే గేట్ మెన్

సస్పెండ్ చేసిన అధికారులు

పాలకోడేరు:శృంగవృక్షం రైల్వే గేట్‌మెన్ కొట్టు ప్రకాశరావు శనివారం అర్ధరాత్రి హైడ్రామా చేశారు. విధుల్లో ఉండగానే మద్యం తాగి ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించారు. వేసిన గేటు తీయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. దీంతో 216 జాతీయ రహదారి వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గేట్‌మెన్ కోటేశ్వరరావు ఉండి మద్యం మత్తులో హంగామా చేశాడు. రాత్రి 10.30గంటలకు విజయవాడ నుండి నరసాపురం వెళ్లే ఫాస్ట్ పాసింజర్ ట్రెయిన్‌కు గేటు వేసిన ఆయన ట్రెయిన్ వెళ్లిపోయిన గేటు తెరవకపోవడంతో వాహనదారులు రైల్వే గేట్ క్యాబిన్ వద్ద పరిశీలించారు. మద్యం మత్తులో ఉన్న రైల్వే గేట్ మెన్ తికమకపడుతూ ఒకటి నొక్కబోయి మరొకటి నొక్కుతూ గందరగోళానికి గురై రైల్వే గేటు ఆపరేటింగ్ సిస్టంకు దండం పెడుతూ తోటి ఉద్యోగులకు ఫోన్ చేసి గేటు తెరుచుకోవడం లేదని అనడం వాహనదారులకు కనిపించాడు. ఆయనను వాహనదారులు నిలదీయడంతో అవును నేను తాగి డ్యూటీకి వచ్చా గేట్ తీస్తున్నాను రావట్లేదు నన్నేం చేయమంటారంటూ వాహనదారులపై దబాయింపులకు దిగాడు. సుమారుగా 40 నిమిషాల పాటు గేట్ మెన్ హంగామా తర్వాత రైల్వే గేట్ తెరుచుకుంది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మద్యం తాగి విధులకు వచ్చే ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై భీమవరం రైల్వే సెక్షన్ ఉన్నతాధికారి సత్యనారాయణ వివరణ కోరగా శాఖపరమైన చర్యల భాగంగా గేట్‌మెన్ కోటేశ్వరరావును సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు.

గేటుమెన్ కోటేశ్వరరావు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

కాళ్లలో కొత్తగా నిర్మించిన సిమెంట్ రోడ్డు


కాళ్ల గ్రామ కార్యదర్శులను సత్కరిస్తున్న ప్రముఖులు

అభివృద్ధి పథంలో కాళ్ల పంచాయతీ

రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు
కాళ్ల గ్రామ సర్పంచి బందా విజయ

ప్రజాశక్తి - కాళ్ల

ఒకప్పుడు సమస్యలతో సతమతమైన కాళ్ల పంచాయతీ నేడు అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది. గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు గ్రామ సర్పంచి బందా విజయ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. సుమారు రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి శభాష్ అనిపించుకుంటున్నారు.

కాళ్ల గ్రామ పంచాయతీ రోజురోజుకూ అభివృద్ధి చెందుతోంది. సర్పంచి విజయ సీసీ రోడ్లు, తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నారు. దళిత మహిళకు విజయకు తొలిసారి సర్పంచిగా అవకాశం లభించింది. అంబేద్కర్ రిజర్వేషన్ వల్ల 2021 పంచాయతీ ఎన్నికల్లో ఎస్‌సి మహిళకు రిజర్వ్ అయ్యింది. ఎన్నికల్లో పోటీ చేసి త్రిముఖ పోటీలో ఆమె సర్పంచిగా గెలుపొందారు. సర్పంచి పదవి చేపట్టిన నాటి నుంచి అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతూ అందరి మన్ననలు పొందుతున్నారు. అభివృద్ధే లక్ష్యంగా ప్రతి వార్డులో దశలవారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. పారిశుధ్యాన్ని మెరుగుపర్చేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కాళ్లలో సుమారు 8 వేల మంది ప్రజలు నివసిస్తున్నారు. రూ.8.20 లక్షలతో రెండు ఫిల్టర్‌బెడ్‌లకు మరమ్మతులు చేపట్టారు.

రూ.25 లక్షలతో ఆలం ప్లాంట్ ఏర్పాటు..

14వ ఆర్థిక సంఘం నిధులు రూ.25 లక్షలతో ఆలం ప్లాంట్ నిర్మించారు. ఆలం ప్లాంట్ నిర్వహణ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టారు. ప్రజలకు సురక్షిత నీరు అందిస్తూ, స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో దీర్ఘకాలికంగా అభివృద్ధికి నోచుకోని జిపిఎస్ రోడ్ల పనులు చేపడుతున్నారు. పంచాయతీ నిధులు సుమారు రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. మురుగు నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నాలుగో వార్డు ముత్యాల వారి వీధిలో రూ.60 లక్షలతో పైప్‌లైన్ విస్తరణ పనులు చేపట్టారు. గ్రామ సచివాలయం-2లో లేఅవుట్ ప్రాంతంలో పైపులైన్‌ను రూ.95 లక్షలతో ఏర్పాటు చేశారు. కాళ్లలో ప్రధాన ఆర్అండ్‌బి రహదారిలో సీసీ డ్రెయినేజీ నిర్మాణానికి రూ.1.50 కోట్లతో 15 ఆర్థిక సంఘం, పంచాయతీ నిధులతో చేపట్టేందుకు అంచనాలు సిద్ధం చేశారు.

పంచాయతీకి నాలుగు అవార్డులు..

మండలంలోని 21 పంచాయతీలకు గాను 12 పంచాయతీలు అవార్డులు దక్కించుకున్నాయి. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా స్థానిక సుస్థిరాభివృద్ధి లక్ష్యాల చేరువలో భాగంగా నిర్దేశించిన తొమ్మిది అంశాల్లో కాళ్ల గ్రామ పంచాయతీ నాలుగు అంశాల్లో సత్తా చాటింది. ఆరోగ్యం, పంచాయతీ, సుపరిపాలన, స్వయం సమృద్ధితో మౌలిక సదుపాయాలు, సామాజిక భద్రత అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి నాలుగు అవార్డులను సాధించింది. ఈ సందర్భంగా కాళ్ల సర్పంచి బందా విజయ, గ్రామ పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమార్, సచివాలయ కార్యదర్శి ఎస్.సింధూజను సన్మానించి అవార్డు అందజేశారు.

మహిళలకు కుట్టు మిషన్లు అందజేత

ప్రజాశక్తి - వీరవాసరం

యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ ఒక్క కాపు సామాజిక వర్గానికి కాకుండా ఇతర సామాజిక వర్గాల ప్రజలకు తమ సేవలు అందజేస్తున్నారని క్లబ్ ప్రతినిధులు అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుపై శిక్షణ ఇచ్చి ఆదివారం కుట్టు మిషన్లు ఉచితంగా అందజేశారు. అనంతరం కాపు క్లబ్ మండల అధ్యక్షుడు గుండా రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో యునైటెడ్ కాపు క్లబ్ ఇంటర్ నేషనల్ గబర్నర్ డా.ముచ్చర్ల సంజయ్ మాట్లాడారు. సమాజాభివృద్ధి కోసం ఈ సంస్థలను స్థాపించినట్లు తెలిపారు. అన్ని ఇంటర్‌నేషనల్ క్లబ్‌ల బైలా నుంచి అంశాలను తీసుకుని ఈ క్లబ్‌కు బైలాను రూపొందించడం జరిగిందన్నారు. సమాజం పట్ల గౌరవం సామాజిక స్పూర్తితో సేవలందించడం జరుగుతుందన్నారు. భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మొగళ్ల వెంకటరమణను క్లబ్ తరుపున సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక కుటుంబంలో ఒక మహిళ ఎంతో శక్తిమంతమైన పాత్ర పోషిస్తుందన్నారు. అటువంటి మహిళలకు ఉపాధి కల్పించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా క్లబ్ అభివృద్ధికి రూ. పది వేలు విరాళం ప్రకటించారు. అనంతరం యాభై మంది మహిళకు కట్టు మిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గుండా జయ ప్రకాష్‌నాయుడు, వైస్ ఎంపిపి అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, ఎంపిటిసి కొల్లేపర శ్రీనివాసరావు, జవ్వాది దాశరథి శ్రీనివాస్, రావూరి అప్పారావు, పోకల రాములు పాల్గొన్నారు.


మహిళలకు కట్టుమిషన్లు అందజేస్తున్న యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్

వైసిపి హయాంలో రాష్ట్రం అప్పులపాలు : ఎంఎల్ఎ

ఉండి:ఒక్క ఛాన్స్ ఇవ్వండి, రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని ప్రగల్భాలు పలికిన జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశాడని ఎంఎల్ఎ మంతెన రామరాజు విమర్శించారు. ఆదివారం చినపుల్లేరు గ్రామంలో ఇంటింటికీ మన బాబు కార్యక్రమంలో భాగంగా అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంతెన రామరాజు మాట్లాడారు. ప్రతి ఇంటిలోనూ విద్యుత్ బిల్లుల షాక్ కొడుతోందన్నారు. ప్రతి ఒక్కరూ చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు, మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

రామకృష్ణకు గురు స్పందన పురస్కారం

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

స్పందన ఇదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ గుంటూరు వారు ఏలూరులో అతిథి ఇంటర్నేషనల్‌లో 'టీచర్స్ రిలేషన్షిప్ ఇన్ ఎడ్యుకేటింగ్ ఫర్ నేషన్ డెవలప్మెంట్ (ట్రెండ్)' ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, ఏలూరు డిఇఒ పి.శ్యాంసుందర్, స్పందన ఇదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఛైర్మన్ ఇదా ఈడా శామ్యూల్ రెడ్డి, ఫౌండేషన్ నేషనల్ సెక్రటరీ టి.సాయి రామకృష్ణ, పులుగు కిషోర్ కుమార్, జానకిరామ్, వివివి.ప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. అనంతరం వైఎన్ కళాశాల డీన్ గంధం శ్రీరామ కృష్ణను 'గురు స్పందన పురస్కార్ - 2022' అవార్డుతో ఘనంగా సత్కరించారు. వీరితోపాటు సీతారామపురం స్వర్ణాంధ్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల ఎంబిఎ విభాగం ప్రొఫెసర్ ఎన్‌జిఎస్.ప్రసాద్, వైఎన్ కళాశాల తెలుగు విభాగం లెక్చరర్ ఎస్.యకోబును సత్కరించారు.

విద్యార్థులకు ఉచిత నైపుణ్య శిక్షణ

ప్రజాశక్తి - ఆకివీడు

రాష్ట్రంలో సార్వత్రిక విద్యనభ్యసిస్తున్న ప్రతి ఒక్కరికీ సాంకేతిక విద్య కూడా ఉచితంగా అందజేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించిందని సార్వత్రిక విద్యాపీఠం రాష్ట్ర సంచాలకుల నాగేశ్వరరావు చెప్పారు. జిల్లాలో త్వరలో నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. సార్వత్రిక విద్యాపీఠం సాంకేతిక నైపుణ్య శిక్షణ సంస్థ అధికారులతో కలిసి డిఇఒ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎంఇఒలు, అపోస్ విద్యా కేంద్రాల కన్వీనర్లు, విద్యార్థులతో కలిసి ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. డిఇఒ రమణ అధ్యక్షత వహించిన సమావేశంలో నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తమ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా ప్రయివేట్‌గా విద్య పదో తరగతి ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ కార్యక్రమం ప్రారంభించామన్నారు. ప్రతి ఒక్కరూ విద్యావంతులు, స్వయంగా ఆర్థిక శక్తిమంతులు కావాలన్నారు. డిఇఒ రమణ మాట్లాడారు. శిక్షణ పొందిన వారికి ప్రభుత్వం సర్టిఫికెట్లు అందజేస్తుందన్నారు. 45 రోజుల నుండి ఆరు నెలల వరకూ శిక్షణ ఉంటుందన్నారు నవంబర్ 15వ తేదీలోగా ఈ శిక్షణలో వారు తమ దరఖాస్తులను ఆయా కేంద్రాలకు కన్వీనర్లకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో విద్యాపీఠం రాష్ట్ర సమన్వయకర్త శివ కోటేశ్వరరావు, జిల్లా సమన్వయకర్త తిరుపతి రాజు, డివైఇఒ రాంబాబు పాల్గొన్నారు.

కులాలవారీగా జనగణన చేపట్టాలి

బిసి ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - పాలకోడేరు

కేంద్ర ప్రభుత్వం వెంటనే కులాల వారీగా జనగణన చేపట్టాలని బిసి ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు గూడూరి వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ బిసి ప్రజా సంక్షేమ సంఘం సమావేశాన్ని గొల్లలకోడేరులో మండల అధ్యక్షులు దొమ్మేటి వేణుగోపాలం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కుల గణన విషయంలో కేంద్ర ప్రభుత్వం కుంటి సాకులు చెబుతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కులాల వారీగా జన గణన చేపట్టి సంఖ్యాపరంగా ఉన్న బీసీలకు సీట్లను కేటాయించాలన్నారు. వచ్చే ఎన్నికల్లోపే వివరాలు బహిర్గతం చేయాలన్నారు. ప్రస్తుతం బిసిలకు 34 శాతం నుంచి 23 శాతానికి రిజర్వేషన్ పరిమితమైందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల్లో కచ్చితంగా 34 శాతం రిజర్వేషన్ కొనసాగించాలన్నారు. అగ్రవర్ణాలకు రిజర్వేషన్ ప్రకటించడం ద్వారా బిసిలను ముంచినట్లేనని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బిసి ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిప్పాడా చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షులు కుక్కల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కండిబోయిన సుబ్రహ్మణ్యం, మండల అధ్యక్షులు దొమ్మేటి వేణుగోపాలం, ఉపాధ్యక్షులు నేతల గోపి, గౌరవాధ్యక్షులు సత్యనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బిసి ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు వెంకటేశ్వరరావు

గాయపడిన ముఠా కార్మికులకు సిపిఎం పరామర్శ

ప్రజాశక్తి - ఆకివీడు

అరాచక మూకల దాడిలో గాయపడిన హమాలీ కార్మికులను సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ కష్టపడి పనిచేసే కార్మికులపై అల్లరి మూకల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రశాంతమైన పట్టణంలో ఇటీవల కాలంలో అరాచకాలు పెరిగిపోయాయన్నారు. అందుకు పోలీసు వారే బాధ్యత వహించాలన్నారు. అమాయక ప్రజలపై దాడులకు తెగబడే అల్లరి మూకలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఈ దాడులు పునరావృత్తం అయితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. పోలీసుల నిర్లక్ష్యం, ఉదాసీన వైఖరి వల్లే ఈ దాడులు పెరుగుతున్నాయన్నారు. జిల్లా ఎస్‌పి జోక్యం చేసుకుని రౌడీ మూకలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వారి వెంట పార్టీ నాయకులు బి.వాసుదేవరావు, పెంకి.అప్పారావు, బివి.వర్మ ఉన్నారు.

కొనసాగిన టిడిపి నిరసన దీక్షలు

ప్రజాశక్తి - ఆచంట

రాజమండ్రి జైల్లో చంద్రబాబు ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఆరోపించారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు నిరసనగా ఆదివారం రిలే దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న వారికి పితాని కండువాలు కప్పి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి బిజెపితో లోపాయికారు ఒప్పందం కుదుర్చుకుని చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టారన్నారు. చివరికి న్యాయ వ్యవస్థను కూడా మభ్యపెట్టేలా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారన్నారు. త్వరలోనే చంద్రబాబు బయటకొస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, మండల నాయకులు కేతా మీరయ్య, నెక్కంటి ప్రభాకర్‌రావు, బికెడి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఉండి : చినపుల్లేరు శివారు తల్లమ్మ చెరువులో ఎంఎల్ఎ మంతెన రామరాజు ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాలకొల్లు : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి నేతలు కళ్ల గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ ఆధ్వర్యంలో నేతలు నిరసన తెలిపారు.

తాడేపల్లిగూడెం: టిడిపి కార్యాలయం వద్ద చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జున రావు (బాబ్జి) ఆధ్వర్యంలో కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పోతుల అన్నవరం, పట్నాల రాంపండు, పద్మనాభుని మురళి, షేక్ బాజీ, గంధం సతీష్ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి వంద క్వింటాళ్ల బియ్యం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ గునుపూడి పంచారామ క్షేత్రంలోని అన్నపూర్ణమ్మవారి ఆలయంలో నిత్యాన్నదానం నిమిత్తం బియ్యం అందజేసి మొక్కు తీర్చుకున్నారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో సోమేశ్వర స్వామి ఆలయ పాలకవర్గం, ఆలయ అధికారులు, అన్నదాన కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. తనకు ప్రభుత్వం ద్వారా వచ్చే పెన్షన్ సొమ్ముకు తోడుగా ఆయన సొంతంగా మరో లక్ష రూపాయలు వేసుకుని అన్నపూర్ణమ్మకు బియ్యం రూపంలో మొక్కుబడి చెల్లించుకున్నారు. వచ్చేనెల 13వ తేదీ నుండి ప్రారంభం కానున్న కార్తీమాసం సందర్భంగా ఆ నెలంతా యాత్రికులకు నిత్యాన్నదానం చేయాలని, ఇందుకు సంబంధించి ముందుగా 100 క్వింటాళ్ల బియ్యాన్ని ఇస్తున్నామని ఆయన తెలిపారు. ఇంకా అవసరమైతే బియ్యం ఇస్తానని చెప్పారు. ఈ సమావేశంలో ఆలయ ఇఒ డి.రామకృష్ణంరాజు, పాలకవర్గ సభ్యులు నాచు శ్రీవల్లి, చెల్లబోయిన సూర్యప్రకాష్, కూర్మాదాసు సత్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

అండర్ - 14,17 బాల, బాలికల జట్ల ఎంపిక

పాలకోడేరు :గొరగనమూడి స్వామి జ్ఞానానంద జిల్లా పరిషత్ స్కూల్ క్రీడా ప్రాంగణంలో స్కూల్ గేమ్స్ అండర్-14, 17 బాల బాలికల జట్ల ఎంపికలు పోటీలు ఆదివారం జరిగాయి. ఈ ఎంపిక పోటీలను గ్రామ సర్పంచి గొట్టుముక్కల వెంకట శివరామరాజు, (శివాజీ రాజు) ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు బాగా రాణించి రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ పొన్నమండ బాలకృష్ణ, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి పిఎస్ఎన్.మల్లేశ్వరరావు, జిల్లా పిఇటి పిడి అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కె.కృష్ణారెడ్డి, ఎండి ఖుద్దూస్, రాష్ట్ర నెట్ బాల్ సంఘం కోశాధికారి దావుద్ ఖాన్, ఎస్‌జిఎఫ్ జాయింట్ సెక్రటరీ సూర్యనారాయణ, స్థానిక పాఠశాల ప్రథమ సహాయకురాలు వై.హేమలత, పిడి ఎన్.విజయలక్ష్మి జట్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి పిఎస్ఎన్.మల్లేశ్వరరావు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ జట్ల వివరాలను తెలియజేశారు. నవంబర్ 9 నుండి 11వ తేదీ వరకూ నెల్లూరు జిల్లా ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాలలో అండర్-17 బాల బాలికల నెట్ బాల్ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి.శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

మొగల్తూరు:మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికలతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు పర్యవేక్షణలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణాల భజన కాలక్షేపం, ప్రసాద వితరణ తదితర సేవ కార్యక్రమాలు నిర్వహించారు.

బాధితురాలికి శ్రీ నేస్తం సేవా సమితి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని అబ్బిరాజుపాలెం గ్రామానికి చెందిన గుబ్బల నాగలక్ష్మికి 24 గంటల నొప్పి రావడంతో ఆపరేషన్ నిమిత్తం ఆదివారం శ్రీ నేస్తం సేవా సమితి ఆధ్వర్యంలో రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కోడె యుగంధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ నేస్తం సేవా సమితి స్థాపించినప్పటి నుంచి మూడు సంవత్సరాల నుంచి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఎంతోమందికి ఆర్థికంగా చేయుతనిస్తూ కరోనా కష్టకాలంలో సైతం తమ సహాయ కార్యక్రమాలను కొనసాగించిన శ్రీ నేస్తం సేవా సమితి సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ నేస్తం సేవా సమితి సభ్యులు, వైసిపి వీరవాసరం మండల అధ్యక్షులు కడలి ధర్మారావు, మల్లుల పాటియ్య, బండి బాలాజీ, దొంగ లక్ష్మీనరసింహస్వామి, చల్లంగి ప్రసాద్, చెల్లుబోయిన రాము పాల్గొన్నారు.

దస్తావేజు పోయినది

ఇందుమూలముగా యావన్మది ప్రజలకు తెలియజేయునది ఏమనగా మా క్లయింటు శ్రీవత్సవాయి సీతారాంరాజు గారి కుమారుడు వెంకట సూర్యనారాయణరాజు ది.26-10-2023వ తేదీన అనగా గురువారము ఉదయం గం॥11:00 సమయమున ఏలూరు జిల్లా, ఏలూరు పట్టణమునందు ఆర్.ఆర్.పేట నుండి ఫైర్ ఆఫీసు సెంటరుకు వెళ్ళే దారిలో **2847/1987 దస్తావేజు పోగొట్టుకునియున్నాడు.** కావున ఎవరికైనా దొరికిన ఎడల ఈ నెంబరుకి 98486 05066 తెలియజేయగలరు.

కె.ఆర్.కె.చౌదరి (బాబి)
అడ్వకేట్, సోమవరప్పాడు, ఏలూరు.
సెల్: 98486 05066

బహిరంగ ప్రకటన

ఇందుములముగా సమస్త ప్రజానీకానికి తెలియుజేయునది ఏమనగా! నా క్లయింట్ శ్రీ **గుత్తుల సత్యనారాయణ, తండ్రి: కన్నయ్య** గారికి చివటం గ్రామంలో గల డాక్యుమెంట్ నంబర్: **1787/1994 క్రయ దస్తావేజు** ద్వారా పొందువున్నరు. సదరు ఆస్తిని గృహ ఋణము కొరకు వెరిటాస్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తాడేప్లిగూడెం బ్రాంచ్ నందు ఋణము తీసుకొనుచున్నడు. సదరు ఆస్తికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్ **ఒరిజినల్ రిజిస్టర్ దస్తావేజు నెం.1898/1979** ఈ లింక్ ఒరిజినల్ దస్తావేజు జిరాక్స్ కాపీలు తీసుకొనుటకు వెళ్లుచుండగా ఒరిజినల్ లింక్ దస్తావేజు పోయినది. ఎంత కాలం వెతికినా దొరకలేదు. వెరిటాస్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తాడేప్లిగూడెం బ్రాంచ్ నుండి ఋణము తీసుకుంటున్నారు, ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ పోయినా దృష్ట్యా ప్రచ్యనంగా **సేల్ డీడ్ 1898/1979** యొక్క సర్టిఫైడ్ కాఫీ ఋణము మొత్తానికి హామీగా సదరు బ్రాంచ్‌కు అవసరమైన అన్ని డాక్యుమెంట్స్‌తో పాటు డిపాజిట్ చేస్తున్నారు. కావున ప్రజానీకానికి తెలియుజేయునది ఏమనగా, సదరు ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ దొరికిన వారు ఈ దిగువ ఇవ్వబడిన చిరునామాకు లేదా పైన తెలిపిన నా క్లయింట్ చిరునామాకు వాపసు చేయగలరు. కావున ఈ ప్రకటన జారిచేయడమైనది.

K.SRINIVASA RAO
Advocate & Notary, Tadepalligudem
Cell: 99895 24989

ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 192/2019

బిట్వీన్:
వాది: త్రిపురారి బుచ్చిరాజు
అండ్
ప్రతివాది: ఉల్లి కృష్ణ, తండ్రి: ఈశ్వరరావు, ముచ్చర్లవారి వీధి, పాలకొల్లు.

ఈ నెంబరు దావాలో ప్రతివాదికు ఎన్ని పర్యాయములు దావా సమన్లు పంపించిననూ అతను తీసుకొనక వాదిని చిక్కులు పెట్టవలెననే దురుద్దేశ్యముతో కాలయాపన చేయుచున్నందున అతనికి దావా సమన్లు అమలు జరగనందున శ్రీ కోర్టు వారు Substitited Service ద్వారా పేపరు ప్రకటనకు ఆర్డరు వేసి పై ప్రతివాది హాజరు నిమిత్తం **ది.16-11-2023వ సం॥రం తేదీకి వాయిదా వేసినారు. కావున సదరు వాయిదాకు ప్రతివాది స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని ఉదయం గం॥10:00 ని॥లకు శ్రీ పై కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

నరసాపురం, 30-10-23.
ఎన్.ఆనంద చక్రవర్తి
అడ్వకేట్, నరసాపురం
సెల్:98491 45267

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం. 79/2022
ఇన్ ఓ.ఎస్.నెం. 42/2017

బిట్వీన్:
కోటబోయిన కాసులు, తండ్రి: అప్పారావు, హిందూ, పురుషుడు, 38 సం॥లు, వ్యాపారం, డో.నెం. 4-35-1, 7వ వార్డు, తాడేపల్లిగూడెం, టి.పి.జి. /పి.జె.సి.జె. **...డి. హెచ్. ఆర్**
మరియు
ఈపి మురళీకృష్ణ, తండ్రి: వెంకటేశ్వరరావు, హిందూ, పురుషుడు, 33 సం॥లు, వ్యాపారం, డో.నెం. 4-12-23, శేష్‌మహాలు థియాటర్ వెనుక, తాడేపల్లిగూడెం, టి.పి.జి. /పి.జె.సి.జె. **...జె.డి.ఆర్**

పై నెంబరు గ్రంధములో డి.హెచ్.ఆర్. గారు శ్రీ కోర్టు వారి ద్వారా మిమ్ములను శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు కావాలని పలుమార్లు కోర్టు వారి ద్వారా నోటీసులు పంపినప్పటికీ మీరు కోర్టు నోటీసులు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారనిన్నీ, కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.14-11-2023వ తేదీ నాటికి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥10:30 ని॥ల లగాయితు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల పై పిటీషను మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

తాడేపల్లిగూడెం, 30-10-23.
జి.వి.ద్వారకానాథ్
డి.హెచ్.ఆర్ తరుపు న్యాయవాది